క్లుప్తంగా

తాగునీటి బోరు ప్రారంభం


తాగునీటి బోరు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి ఆకులవీధిలో ఏర్పాటు చేసిన నూతన తాగునీటి బోరును శుక్రవారం వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా ప్రారంభించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గూడెల కృష్ణ, పుక్కల కృష్ణ , రాజారావు, పోలిరాజు, ధర్మ, నాగరాజు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


సంక్షేమ పథకాలను వివరిస్తున్న రమేష్

విశాఖ విద్య: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా పార్టీ పరంగా నాయకులు కృషి చేయాలని బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి రమేష్ అన్నారు. నియోజకవర్గంలోని పలు వార్డుల్లో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పూజారి నాగయ్య,బాల రాజేశ్వరరావు, మంజుల, నర్సింగరావు, శివ ,మహేష్ పాల్గొన్నారు.

గెడ్డల్లో పూడికల తొలగింపు


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: ఇటీవల కురిసిన వర్షాలకు 58వ వార్డు శ్రీరామ్‌నగర్, గుల్లలపాలెం ప్రాంతాల్లోని గెడ్డల్లో భారీగా వ్యర్థాలు పేరుకు పోయాయి. దీంతో మురుగు రోడ్డుపైకి వస్తోంది. సమస్యపై స్పందించిన కార్పొరేటర్ గులిగిందల లావణ్య వార్డు శానిటరీ అధికారులకు శ్రీరామ్‌నగర్,గుల్లలపాలెం గెడ్డల్లో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం పొక్లెయిన్ సాయంతో గెడ్డలో పూడికలు తొలగించారు. ఈ పనులను ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో గులిగిందల కృష్ణ, వార్డు శానిటరీ అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలి


తహసీల్దారు కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాండ్రేగుల సత్యాంజనేయ అన్నారు. వాటిని కట్టడి చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. నిత్యావసర సరకుల ధరల పెంపునకు వ్యతిరేకంగా సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలోని తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలను తగ్గించకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, పోతిన రాము, సీహెచ్ పాత్రుడు, కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ధరల పెంపుపై రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

గణపతి పూజకు వేళాయె

- మార్కెట్‌లో పూజా సామగ్రి కొనుగోళ్ల సందడి
- సిద్ధమైన మండపాలు


విక్రయిస్తున్న వినాయక విగ్రహాలు


మర్రిపాలెం రైతు బజార్‌లో పూజా సామగ్రి కొనుగోళ్లు

గోపాలపట్నం/విశాఖ విద్య: వినాయక చవితి పండగను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి ప్రజానీకం సిద్ధమయ్యారు. వాడవాడలా గణనాథుని విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బొజ్జ గణపయ్యపూజతో సకల విఘ్నాలు తొలగిపోతాయనే ప్రగాఢ నమ్మకంతో ప్రతి ఇంటా వినాయక చవితి వేడుకలను తోచిన రీతిన చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లో శుక్రవారం సందడి కనిపించింది. ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్, అదేవిధంగా గోపాలపట్నం, మర్రిపాలెం వైపు వచ్చే రహదారుల్లో గణనాథుని విగ్రహాల విక్రయాలు జోరుగా సాగాయి. మర్రిపాలెం రైతుబజార్‌లో పూజా సామగ్రి విక్రయాల కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. రైతు బజార్ ఈవో కొమ్మనాపల్లి వరహాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.గోపాలపట్నం ప్రధాన రహదారితో పాటు సింహాచలం రైల్వే స్టేషన్ వెళ్లే మార్గాల్లో వినాయక బొమ్మలు, పండ్లు, మిఠాయిలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు.

మట్టి విగ్రహాలపై మక్కువ

కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పొందిన ప్రజానీకం ఈ ఏడాది మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకే ఎక్కువగా ఆసక్తి చూపారు. సబ్బవరంలో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను తీసుకొచ్చి ఎన్‌ఏడీ సెంటర్‌లో పలుచోట్ల విక్రయించారు. రూ.30లు నుంచి రూ.1200 వరకు ఖరీదు చేసే మట్టి విగ్రహాలు అందుబాటులో ఉంచారు.

చవితి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

వినాయక చవితి ఉత్సవాలకు ఎన్‌ఏడీ పరిసర కాలనీల్లో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాల వెలుగులతో మండపాలు దేదీప్యమానంగా కనిపిస్తున్నాయి. 52వ వార్డు పరిధిలోని శాంతినగర్, మర్రిపాలెం, వుడా లేఅవుట్ కాలనీ, కరాస, 90 వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ ఈబీకాలనీ, కాకాని నగర్, విమాననగర్ తదితర చోట్ల భారీ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మండపాలు ఏర్పాటు చేశారు. భారీగా విద్యుత్ సెట్టింగ్‌లు వేయడంతో ఆకర్షణీయంగా ఉన్నాయి.


పూజా పత్రి విక్రయిస్తున్న మహిళ


గణపతికి ఇష్టమైన చెరుకు ముక్కలు


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న సింహాచలం రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి

ఆహార పద్ధతులే ఆరోగ్యానికి రక్ష

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి
- అంగన్‌వాడీల్లో ఉత్సాహంగా పోషణ మాసోత్సవాలు


62వ వార్డులో పౌష్టికాహార ఆవశ్యకతను వివరిస్తున్న సీడీపీవో రమణకుమారి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి

విశాఖ విద్య: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జేటీఎస్ జ్యోతి అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే మేలును వివరించేలా ప్రదర్శన ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలకు ఏ ఆహారం తీసుకోవడం వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉంటాయో వివరించారు. సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ గర్భం దాల్చిన నుంచే సరైన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం వల్లే రక్తహీనత సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జె. మార్త, ఎస్. రాధాకుమారి ,కె. వరలక్ష్మి, జి. ఉమామహేశ్వరి, ఏఎన్‌ఎంలు సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కూడా పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిషోర బాలికలకు సచివాలయ ఏఎన్‌ఎం తార ఆరోగ్యపరమైన సలహాలు ఇచ్చారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి మల్కాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలను సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి హరినాథ్, మెహర్జీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జ్యోతిశ్రీ, అంగన్‌వాడీ టీచర్ సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో రమణకుమారి, సూపర్‌వైజర్ వరలక్ష్మి పాల్గొని తల్లులకు, గర్భిణులకు మంచి పోషక విలువలు కలిగినగుడ్లు, పాలు, రాగిపిండి,ఖర్జూరం తదితర ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జ్యోతి, సుజాత, మహిళా పోలీస్ నిరుపమ, అంగన్‌వాడీ టీచర్ హేమవతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

59వ వార్డులో..

మల్కాపురం: పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉండాలంటే నిత్యం పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు.59వ వార్డు గణపతినగర్ అంగనవాడీ సెంటర్‌లో పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలాంటి పౌష్టికాహారం అందించాలి, ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలి

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్


మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు


మల్కాపురంలో విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఈపీడీసీఎల్ ఏడీ త్రినాథ్, నాయకులు


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న శ్రీధర్, ఆల్లా కృష్ణ

విశాఖ విద్య: వినాయక చవితి పండగ రోజున మట్టితో తయారు చేసిన విగ్రహాలనే ఏర్పాటు చేసి, పూజలు చేయాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్లా కృష్ణ పిలుపునిచ్చారు. 52వ వార్డు ఓల్డ్ కరాస లో శ్రీ బంగారమ్మ – శ్రీ దుర్గాలమ్మ ఆలయ కమిటీ , కరాస రాక్ స్టార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు అందించే మంచి గాలి నీరు కాలుష్య రహితంగా ఉండేలా ప్రతీ ఒక్కరు ఇళ్లల్లో మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జియ్యాని విజయ్, శ్రీదేవి, నగిరెడ్డి రమణారెడ్డి , బేరి హరికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

సింధియా: వినాయక చవితి పండగ పురస్కరించుకుని పర్యావరణానికి ముప్పు లేకుండా మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. ఏకే సీకాలనీలో కార్పొరేటర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు అందజేశారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడం వల్ల కులవృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న కుమ్మరి వాళ్లకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, గంటా వర్మ, తాతబాబు, సూరి, రాజు, బైరాగి, కిషోర్, హరి, సూరిసత్యం, సందీప్, గణేష్, వెంకటేష్, శ్రీను, కోటి, సత్తిబాబు, జోగినాయుడు పాల్గొన్నారు.

ఉచితంగా విగ్రహాల పంపిణీ

మల్కాపురం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఈపీడీసీఎల్ ఏడీ త్రినాథరావు అన్నారు. 61వ వార్డు మల్కాపురం వద్ద మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పిలక రామోహన్‌రెడ్డి ,టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేష్,జనసేన నాయకుడు పుర్రె సురేష్ పాల్గొన్నారు.

- 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలోని ప్రతిభ పబ్లిక్ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను హెచ్‌ఎం వెంకటరమణియాదవ్ పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా: సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని 62వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం అన్నారు. వార్డు పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా నివారణ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ దోమల నియంత్రణ కోసం శ్రమిస్తున్న అధికార యంత్రాంగానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేస్తే వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రజలు వ్యర్థాలను తడి-పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చునని, ప్రజలందరు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా నివారణ సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీ రాము, శానిటరీ సెక్రటరీలు రమాదేవి, వెంకునాయుడు, శ్రీనివాసరావు, ప్రదీప్, మలేరియా సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, సచివాయల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: విజయవాడలో వరదల్లో చిక్కుకున్న బాధితులకు చేయూతనందించేందుకు ప్రజలు ముందుకు రావాలని మల్కాపురం సీపీఐ నాయకులు కోరారు. వరద బాధితులను ఆదుకునేందుకు సీపీఐ శుక్రవారం పారిశ్రామిక ప్రాంతంలో విరాళాల సేకరణ చేపట్టింది. వారు తొలుత మల్కాపురం గ్రామ మండలి వద్ద విరాళాల సేకరణ ప్రారంభించారు. బాధితులకు ఆసరా ఇచ్చేందుకు ప్రతీ ఒక్కరూ మానవత్వంతో ముందుకు రావాలని కోరారు. సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికీ ఎంతో మంది తిండి, నీరు లేక ఇబ్బంది పడుతున్నారని, మనమంతా వారికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు..

జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి


యాజమాన్యంతో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మల్కాపురం: రఫ్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలను చెల్లించడం లేదని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ఆరోపించారు. జీవో ప్రకారం వేతనాలను ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్యకర్తలతో కలిసి సంస్థ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భోగవల్లి మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) విస్తరణ పనులను ఎల్ అండ్ టీ, రఫ్ సంస్థలు చేపడుతున్నాయని తెలిపారు. అయితే, రఫ్ సంస్థలో పని చేస్తున్న సుమారు 5వందల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలను చెల్లించాల్సి ఉన్నా, అలా ఇవ్వకుండా సంస్థ యాజమాన్యం శ్రమదోపిడీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించి జీవో ప్రకారం వేతనాలను చెల్లించకుంటే గేటు వద్ద కార్మికులందరితో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు తాతబాబు, వై.నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్

విశాఖ విద్య: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. జీవీఎంసీ జోన్-8 ఏఎంహెచ్‌వో డాక్టర్ అప్పలనాయుడు శుక్రవారం బొమ్మిడి రమణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో జీవీఎంసీ ఆరోగ్యశాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై చర్చించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. వారి వెంట వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుకు మద్దతుగా...

10న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు


దీక్షా శిబిరంలో పాల్గొన్న వైఎస్సార్‌టీయూసీ, ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కును బతికించాలనే నినాదం హోరెత్తేలా ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించనున్నామని ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గొందేశి వెంకటరమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి, బొడ్డ గోవింద్ తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కులో ఉత్పత్తిని మెరుగుపర్చడానికి యాజమాన్యం ఎటువంటి చర్యలు చేపట్టకపోయినా, కార్మికులు, ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి మాత్రం పక్కా ప్రణాళికలు వేసి వాటిని అమలు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం ప్లాంట్‌లో 12వేల మంది కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అందులో మూడో వంతు ఉద్యోగులను ఇంటికి పంపించడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటుందని మండిపడ్డారు. ముడి సరకులు కొనుగోలుకు నిధులు కేటాయించాలని, నిర్వాహణ మూలధనం సర్దుబాటు చేయాలని ఉద్యోగులు కోరితే కేంద్ర ప్రభుత్వ పెద్దలు మాత్రం వీఆర్‌ఎస్ పథకంలో ఉద్యోగులను ఇంటికి పంపించడానికి నిధులు కేటాయించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, మార్టుపూడి పరదేశి, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర, శ్రీనివాస్ నాయుడు, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, అండిబోయిన అప్పారావు, దరిగి రవి, గాలి నూకరాజు పాల్గొన్నారు.

మండపాల వద్ద డీజేలు నిషేధం

ఉక్కునగరం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల వద్ద డీజేలు నిషేధించినట్టు స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు తెలిపారు. మండపాలు ఏర్పాటు చేసేవారు టౌన్ అడ్మిన్, స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్, ఎలక్ట్రికల్ విభాగాల వద్ద అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇతరులకు అసౌకర్యం కలిగించేలా లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయరాదన్నారు. రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు వినియోగించరాదన్నారు.

గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖ విద్య: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం గాంధీనగర్‌లో జీవీఎంసీ నిధులతో ఆధునికీకరించిన గ్రంథాలయ భవనాన్ని స్థానిక కార్పొరేటర్ బొమ్మిడి రమణతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. యువతతో పాటు అన్నివర్గాల వారికి ఉపయోగకరంగా ఉండేలా గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో జ్ఞాపకశక్తి మెరుగుదల


మెడిటేషన్ బ్రోచర్ విడుదల చేస్తున్న రాజయోగి బీకే మంజునాథ్

అగనంపూడి: విద్యార్థులు జ్ఞాపక శక్తిని పెంపొందించుకోడానికి యోగా సాధన చేయాలని బ్రహ్మ కుమారీస్ బెంగళూరు ఇన్‌చార్జి, రాజయోగి బీకే మంజునాథ్ అన్నారు. అగనంపూడి దిబ్బపాలెం పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోడానికి ఉన్నతమైన లక్ష్యాలను అలవర్చుకోడానికి మెడిటేషన్, యోగా దోహదపడతాయన్నారు. ప్రతీరోజు యోగ సాధన, మెడిటేషన్ చేయడం వల్ల మానసిక స్థిరత్వం కలుగుతుందన్నారు. తర్వాత విద్యార్థులతో మెడిటేషన్ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రంగారావు, ఎస్.నాగభూషణం పాల్గొన్నారు.